సాక్షి
వికారాబాద్
ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



ఆగని మట్టి దందా!
సహజ సంపద తరిగిపోతుంది. అనుమతుల్లే కుండా కొండలు, గుట్టలను అక్రమార్కులు రాత్రికి రాత్రే తవ్వేస్తున్నారు. 8లో▸



బ్యాడ్మింటన్‌లో..
ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తాండూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 8లో▸



ఎగ్ బిర్యానీ ఎత్తేశారు!
ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అంగన్‌వాడీల పాత్ర కీలకంగా మారింది. 9లో▸

న్యూస్‌రీల్

యథావిధిగా ప్రజావాణి
కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రద్దు చేసినట్లు ప్రకటించామని.. ఎన్నికల స్టే రావడంతో కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. ప్రజలు గమనించి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జుంటుపల్లి రామాలయ అభివృద్ధికి చర్యలు
తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే బీఎంఆర్

యాలాల: మండల పరిధిలోని జుంటుపల్లి సీతారామ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జుంటుపల్లికి చెందిన ఆశప్ప ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రామాలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలను తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లకు కేంద్రం అడ్డంకులు
సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్



అమరవీరుల స్తూపం వద్ద సీపీఎం నాయకుల ఆందోళన

అనంతగిరి: తెలంగాణ బీసీలపై కేంద్రం కపట నాటకం తేటతెల్లమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్ విమర్శించారు. శనివారం వికారాబాద్‌లోని అమరవీరుల స్తూపం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మైపాల్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను గవర్నర్ ఆమోదించకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. బీజేపీ నాయకత్వం బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని లేదంటే బీసీలను క్షమాపణ కోరాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయ పద్ధతిలో రిజర్వేషన్ల అమలుకు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుదర్శన్, సతీశ్, నవీన్, అక్బర్, గోపాల్, శ్రీనివాస్, మహేందర్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన బార్ అసోసియేషన్ కమిటీ



ఇబ్రహీంపట్నం: డీజీపీ శివధర్‌రెడ్డిని ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా 12 కోర్టు భవన సముదాయాల నిర్మాణం గురించి వివరించారు. తనవంతు సహకారం అందిస్తానని శివధర్‌రెడ్డి తెలిపినట్లు వారు చెప్పారు. అదేవిధంగా న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డిని సైతం కలిసి స్థానిక సమస్యలను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌కుమార్, ఉపాధ్యక్షుడు భాస్కర్, లైబ్రరీ సెక్రటరీ పాండు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

పహాడీషరీఫ్: రాష్ట్రంలో మున్సిపల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న కారోబార్, బిల్ కలెక్టర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర అవుట్ సోర్సింగ్ కారోబార్, బిల్ కలెక్టర్ల కమిటీ కోరింది. ఈ మేరకు కమిటీ నాయకులు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2016లో ఇచ్చిన జీవోఎంఎస్–14 ప్రకారం మున్సిపాలిటీలో కలిసిన గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. తమకు కేటాయించిన పనులను సమర్థవంతంగా చేస్తున్నప్పటికీ, నెలకు కేవలం రూ.15,600 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న అందరినీ రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం రూ.22,750 చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ఎందుకిలా..?

ఎవ్రీ వన్ ఈజ్ యూనిక్.. విద్యా వ్యవస్థలో పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న వారికి ఈ పదం తెలియని వారుండరు. విద్యార్థులు ఎవరికి వారు ప్రత్యేకమని అర్థం. ఒక్కొక్కరిలో ఒక్కోలా సామర్థ్యాలు, అభ్యసనా శైలి, ఆసక్తి, సవాళ్లుంటాయి. వ్యక్తిగత వ్యత్యాసాలను గుర్తించడమే ప్రధానం. క్రమశిక్షణ పేరిట అందరినీ ఒకేలా చూడడం కుదరదు. చాలా చోట్ల పిల్లలను చూడడంలో మాత్రం ఈ ప్రాథమిక సూత్రాన్ని విస్మరిస్తున్నారు. దీంతో తరచూ గురుకులాలు, విద్యాలయాలు, వసతి గృహాల్లో ఆత్మహత్యాయత్నాలు జరుగుతున్నాయని విశ్లేషకుల అభిప్రాయం.

- గురుకులాలు, వసతి గృహాల్లో ఆందోళన కలిగిస్తున్న విద్యార్థుల ఆత్మహత్యాయత్నాలు
- ఘటనలు చోటుచేసుకున్న సమయంలోనే అధికారుల హడావుడి
- కొత్తగడి, నవాబుపేట, మొయినాబాద్ ఘటనలు మరువక ముందే మంబాపూర్ గురుకులంలో భవనంపై నుంచి దూకిన విద్యార్థి
- ప్రిన్సిపాళ్లు, వార్డెన్లపై తీవ్ర ఆరోపణలు
- ప్రత్యేక కౌన్సెలింగ్ చర్యలను పక్కన పెట్టిన ప్రభుత్వం



మంబాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర వసతి గృహం

వికారాబాద్: వసతి గృహాలు,గురుకుల పాఠశాలల్లో పరిస్థితులు నానాటికి తీసికట్టుగా మారుతున్నాయి.ఉన్నతాధికారులు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు. సంబంధిత శాఖల హెచ్‌ఓడీలు పర్యవేక్షణ గాలికొదిలేయడంతో వార్డెన్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.దీంతో బలవన్మరణానికి యత్నిస్తున్న ఘటనలు పెరిగిపోయాయి. దుర్ఘటనలు జరిగిన సమయాల్లో హడావుడి చేస్తున్న అధికారులు తర్వాత పట్టించుకోవడం మానేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కొన్ని చోట్ల సమస్యలు వేధిస్తుంటే.. మరి కొందరు విద్యార్థులు పరిస్థితులకు అలవాటు పడక, సహచర విద్యార్థులతో ఇమడ లేక ఆత్మహత్యలకు యత్నించడం,పారిపోవడం తదితర మార్గాలను ఎంచుకుంటున్నారు.గతంలో కొత్తగడి గురుకులలో ఓ విద్యార్థి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించడం..మొయినాబాద్, నవాబుపేటలోనూ ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యాయి. తాజాగా పెద్దేముల్ మండలం మంబాపూర్ గురుకుల పాఠశాలలో ఆరోతరగతి విద్యార్థి శనివారం భవనంపై నుంచి దూకడం చర్చనీయాంశమైంది.

మండల ప్రత్యేకాధికారులుగా హెచ్‌ఓడీలు

విద్యార్థులు ఏడాది పొడవునా సమస్యలతో సతమవుతున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం మొదలు అస్వస్థతకు గురవ్వడం, ఇబ్బందులు పడడం తరచూ వెలుగులోకి వస్తున్నాయి. ఇందుకు స్పందించిన కలెక్టర్ జిల్లా ఉన్నతాధికారులకు హాస్టళ్లు, పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఆయా శాఖల హెచ్‌ఓడీలను మండలాల ప్రత్యేకాధికారులుగా నియమించారు. వారు వారంలో రెండు స్కూళ్లు, హాస్టళ్లను సందర్శించి పరిస్థితి పర్యవేక్షించాలని అవసరమైన చోట చక్కదిద్దాలని ఆదేశించారు. ఈ చర్యలు కొనసాగుతున్నప్పటికీ పరిస్థితులు మాత్రం మారడం లేదు.

టార్గెట్ చేశారు

ఓ సిమెంట్ దుకాణంలో దినసరి కూలీగా పనిచేస్తూ కూతురిని గురుకుల పాఠశాలలో చేర్పించా. ఆమె మొదటి నుంచి మెరిట్ స్టూడెంట్, 8, 9వ తరగతుల్లోనూ ఏ గ్రేడ్ వచ్చింది. తమ కూతురును చూసేందుకు వెళ్లినప్పుడు మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని చూపింది. బాగు చేయించాలని ఉపాధ్యాయులను కోరాం. దీంతో వారు మా కూతురిని టార్గెట్ చేశారు. దీంతో ఆమె భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో కాలు విరిగడంతో పాటు గాయపడింది. కట్టు కట్టించి ఇంటికి పంపారు.

– యాదయ్య, బాధిత విద్యార్థి తండ్రి

క్రమశిక్షణ పేరుతో శిక్షలు నేరం

విద్యాహక్కు(ఆర్టీఈ) చట్టం ప్రకారం పనిష్‌మెంట్, మానసిక, శారీరక శిక్షలు, అవమానించటం, వేధింపులకు గురిచేయడం, తోటి విద్యార్థుల ముందు అవమానించేలా మాట్లాడడం, క్రమశిక్షణ పేరుతో పనిష్‌మెంట్ ఇవ్వడం బోధనా పద్ధతులకు వ్యతిరేకం. ఇది నేరం కూడా. రికార్డులు, పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చిన విద్యార్థులను తోటి విద్యార్థుల ముందు తక్కువ చేసి మాట్లాడడం, అవమానించడం, క్షోభకు గురిచేయడం తదితర కారణాలతో గతంలో పలువురు విద్యార్థులు ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టారు. కాగా ఈ ఘటనలు చోటు చేసుకున్న సమయంలో బాధిత విద్యార్థులు క్షోభకు గురికావడానికి గల కారణాలు విశ్లేషించడం, విద్యార్థులు, ఉపాధ్యాయులకు మానసిన వైద్య నిపుణులు, మోటివేటర్స్‌తో కౌన్సెలింగ్ ఇప్పించటం లాంటి చర్యలు చేపట్టడం లేదు.

సామాజిక తనిఖీలు అవసరం



బాలల విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యా విషయాలపై..విద్యార్థులపై ఒత్తిడి చేయడం.. మిగతా విద్యార్థుల ముందు చులకనగా మాట్లాడటం నేరం. పలు సందర్భాల్లో విద్యార్థులను ఒత్తిడికి గురిచేసినట్లు స్పష్టమవుతోంది. ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. గురుకుల ఉపాధ్యాయులకు, బోధనేతర సిబ్బందికి సైతం బాలల హక్కులు, వాటి పరి రక్షణపై, హక్కులను కాలరాస్తే పడే శిక్షలపై శిక్షణ అవసరం. బాలల రక్షణ విధానం అమలును ప్రతీ మూడు నెలలకు ఒకసారి సామాజిక తనిఖీ ద్వారా సమీక్షించాలి. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలోనూ ఓ కమిటీ వేసి సామాజిక తనిఖీ నిర్వహించాలి.

– ఆర్. వెంకట్‌రెడ్డి, కన్వీనర్, బాలల హక్కుల పరిరక్షణ వేదిక

హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేదని..

- భవనం మొదటి అంతస్తు పైనుంచి దూకిన విద్యార్థి
- మంబాపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే వసతిగృహంలో ఘటన
- టీసీ ఇవ్వకపోవడంతోనే దూకానంటున్న బాలుడు



చికిత్స పొందుతున్న విద్యార్థి విరాట్

తాండూరు రూరల్: హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేని ఓ విద్యార్థి భవనం మొదటి అంతస్తు పైనుంచి కిందికి దూకాడు. అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన పెద్దేముల్ మండలం మంబాపూర్ సమీపంలోని మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల బాలుర వసతిగృహంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వసతి గృహం అధికారులు, విద్యార్థి తల్లిదండ్రుల కథనం ప్రకారం.. ధారూరు మండలం కొండాపూర్‌కలాన్ గ్రామానికి చెందిన విరాట్ ఆరో తరగతి చదువుతున్నాడు. గతేడాది ఇక్కడే ఐదో తరగతి పూర్తి చేశాడు. తనకు హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేదంటూ కొద్ది రోజులుగా మారాం చేస్తున్నాడు. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన విరాట్ అయిష్టంగానే హాస్టల్‌కు వచ్చాడు. తాను వెళ్లనని చెప్పినా ఈసారి ఆరో తరగతి పూర్తి చేస్తే వచ్చే ఏడాది నీకు నచ్చిన చోట చేర్పిస్తామని బుజ్జగించిన తల్లిదండ్రులు గత మంగళవారం అతన్ని హాస్టల్‌లో వదిలివెళ్లారు. మూడు రోజులు బాగానే ఉన్న విరాట్ శుక్రవారం సాయంత్రం హాస్టల్ భవనం మొదటి అంతస్తు పైనుంచి దూకాడు. గమనించిన సిబ్బంది వెంటనే అతన్ని తాండూరు పట్టణంలోని మాతాశిశు ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. విద్యార్థి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు కూడా ఆస్పత్రికి చేరుకున్నారు. హాస్టల్‌పై నుంచి దూకడంతో విరాట్ తలకు గాయమైంది. పెద్ద ప్రమాదమేమీ లేదని వైద్యులు చెప్పడంతో హాస్టల్ అధికారులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే తనకు హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేదని, టీసీ అడిగితే ఇవ్వకపోవడంతోనే భవనం పైనుంచి దూకానని విద్యార్థి తెలిపారు. ఈ విషయమై హాస్టల్ అధికారులు శనివారం పెద్దేముల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదైంది.

బాలికలను ప్రోత్సహించడం బాధ్యత



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

- సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

అనంతగిరి: సమాజంలో లింగ సమానత్వం, బాలిక హక్కులను కాపాడాల్సిన బాధత్య ప్రతీ ఒక్కరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకారంతో వికారబాద్ డైట్ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చదువుతో ఏదైనా సాధ్యమని.. తల్లిదండ్రులు బాలికలను సైతం బాలురతో సమానంగా అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు హక్కులపై అవగాహన పెంచుకుని సమాజంలో సమానత్వం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శాంతిలత జువైనెల్ జస్టిస్ చట్టం,బాల్యవివాహ నిషేధ చట్టం, బాలల హక్కుల పరిరక్షణ గురించి వివరించారు. బాల్యవివాహాలు, బాలల దుర్వినియోగం అరికట్టడంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం ఎంవీ ఫౌండేషన్ రాష్ట్ర సమన్వయకర్త రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. బాలబాలికలకు విద్యను అందించాల్సిన బాధ్యత సమాజం, ప్రభుత్వం మీద ఉందన్నారు.గ్రామ స్థాయిలో విద్యను ప్రోత్సహించి బాల్యవివాహాలు అరికట్టాలని కోరారు.అనంతరం విద్యార్థులతో లింగ సమానత్వం, బాలల హక్కుల పరిరక్షణపై నిబద్ధతతో ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్మన్ వెంకటేశ్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ టి.వెంకటేశ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీనివాస్, ఎస్ఐ మీనాక్షి , ఫౌండేషన్ సమన్వయకర్త శ్రీనివాస్, సాధన సమితి ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పప్పు ధాన్యాలకు డిమాండ్

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: పప్పు ధాన్యాల సాగుతో రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చునని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని నస్కల్ రైతు వేదికలో పప్పు ధాన్యాల్లో ఆత్మ నిర్భర్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలకమైందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న నేపథ్యంలో పప్పు ధాన్యాల సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలన్నారు. ప్రతీ గ్రామంలో రైతు సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. వ్యవసాయాధికారుల సూచనలు సలహాలు పాటించి సత్ఫలితాలు రాబట్టాలన్నారు. రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ డీఎస్ లక్ష్మీకుమారి, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ ఆయూబ్, కాంగ్రెస్ పూడూర్ మండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హస్తం గూటికి బీఆర్ఎస్ నేతలు

గండీడ్ మండల పరిధిలోని చెన్నాయపల్లి తండా అనుబంధ గ్రామం మాలగుడిసెలకు చెందిన బీఆర్ఎస్ నేతలు హస్తం గూటికి చేరుకున్నారు. శనివారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి నివాసంలో ఆయనను కలసి పార్టీలో చేరారు. పెద్ద అంజిలయ్య, చిన్న అంజిలయ్య, రమేశ్, సురేశ్, కృష్ణ, వెంకటయ్య, రమేశ్, మాధురి వెంకటయ్య, మొగులయ్యతో పాటు మరో 50 మందికి ఎమ్మెల్యే కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ నర్సింహారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి మోహన్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి ఆదర్శంగా భారత్



శత జయంతి ఉత్సవాల్లో స్వయం సేవకులు

అనంతగిరి: ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలన్ (కవాతు) వికారాబాద్ పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా భారీ కవాతు నిర్వహించారు. పట్టణంలోని కొత్తగంజ్ నుంచి ప్రారంభమై ప్రధాన వీధుల మీదుగా సాగింది. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సద్భావన సహ ప్రముఖ్ రామకృష్ణ మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణకు ఆర్‌ఎస్‌ఎస్ పాటుపడుతుందన్నారు. ఈ దేశానికి ఘనమైన చరిత్ర ఉందన్నారు. యావత్ ప్రపంచానికే దిశానిర్దేశం చేసిన ఘనత భరత భూమికే దక్కుతుందన్నారు. హిందూ సమాజం ఐక్యతతో ముందుకు సాగాలని.. రాబోయే రోజుల్లో ప్రపంచానికే దేశం ఆదర్శంగా నిలవబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘచాలక్ సత్యనారాయణగౌడ్, సహ సంఘచాలక్ గోవర్ధన్‌రెడ్డి, ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ కూర జయదేవ్, సంఘ పెద్దలు, పట్టణ ప్రముఖులు, స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ వ్యవసాయం

- రైతుల కోసం ప్రత్యేక చానల్ ప్రారంభించిన వ్యవసాయ శాఖ
- కర్షకుల సమస్యలకు పరిష్కారం చూపుతున్న శాస్త్రవేత్తలు, అధికారులు
- క్షణాల్లో సమాచారం చేరవేత

దుద్యాల్: రైతులకు వ్యవసాయ సమాచారం సులువుగా అందించేందుకు వ్యవసాయ శాఖ నూతనంగా వాట్సప్ చానల్ రూపొందించింది. సాగు చేసిన పంటలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు ఈ చానల్‌లో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచనలు అందిస్తున్నారు. ఈ చానల్ పంటలకు సంబంధించి కావాల్సిన సమాచారాన్ని క్షణాల్లో కర్షకులకు చేరవేస్తూ అండగా నిలుస్తోంది. ప్రభుత్వ పథకాలు, వాతావరణ సూచనలు, నాటు పద్ధతులు, ప్రభుత్వ రాయితీలు, తదితర వ్యవసాయ సమాచారాన్ని అందిస్తున్నారు.

తెలుగులో సమాచారం

వ్యవసాయశాఖ ప్రారంభించిన వాట్సాప్ చానల్‌లో అధికారులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక ప్రతిభావంతులను చేర్చారు. తాజాగా గ్రూప్‌లో రైతులను చేర్చాలని ఆదేశాలు రావడంతో ఆసక్తి ఉన్న రైతులను వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుల ఫోన్ నంబర్లు నమోదు చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతీ రైతు వాట్సాప్ చానల్‌లో చేరే అవకాశం కల్పించింది. విత్తన దశ నుంచి పంట చేతికి వచ్చే వరకు పంటల సమాచారం రైతులకు సులువుగా చేరుతోంది. తెలుగులోనూ సమాచారం అందుబాటులో ఉండడంతో రైతులు వినియోగించుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. తెగుళ్లను ఫొటోలతో సాయంతో లక్షణాలు, నివారణకు పురుగు మందులు ఎలా వినియోగించాలనే సమాచారం ఇస్తున్నారు. వాట్సాప్ చానల్‌లో చేరాలనుకుంటే సంబంధిత ఏఈఓ, మండల వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

ఒక్క క్లిక్‌తో..

వ్యవసాయశాఖ రూపొందిన వాట్సాప్ చానల్ ద్వారా రైతులు ఒక క్లిక్‌తో నేరుగా శాస్త్రవేత్తలు, నిపుణుల సలహాలు పొందవచ్చు. పంటల రోగ నిరోధకత, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, విత్తనాల ఎంపిక వంటి సలహాలు అరచేతిలోకి చేరుతున్నాయి. తమ సమస్యలను ఫొటో లేదా మెసేజ్ రూపంలో షేర్ చేస్తే నిపుణులు వెంటనే సమాధానం అందిస్తారు. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ మంది రైతులకు ఒకే సారి సమాచారం తెలుసుకునేందుకు డిజిటల్ వ్యవసాయ విజ్ఞానం చాలా ఉపయోగకరంగా ఉందని రైతులు చెబుతున్నారు.



వ్యవసాయశాఖ రూపొందిన వాట్సప్ చానల్

తక్షణ పరిష్కారం



రైతులకు సాంకేతిక పరిజ్ఞానం నేరుగా అందించడం వ్యవసాయ శాఖ ఉద్దేశ్యం. ఇప్పటికే రైతులు సమాచారలోపంతో సాగు చేస్తున్న పంటల్లో దిగుబడులు తగ్గి నష్టపోతున్నారు. అందరి రైతుల వద్దకు వ్యవసాయ శాస్త్రవేత్తలు వెళ్లడం కష్టం. ఈ చానల్ ద్వారా శాస్త్రవేత్తలు, నిపుణుల సలహాలు పొందవచ్చు. సమస్యలపై తక్షణ పరిష్కారం అందించడంతో ఉత్పత్తి పెరుగుతుంది. సమయం, ఖర్చు తగ్గుతుంది. రైతులు చానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవాలి.

– రాజారత్నం, జిల్లా వ్యవసాయ అధికారి, వికారాబాద్

రైతులకు వరం ‘పీఎం ధన్‌ధాన్య’

- రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి ఉష



కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి ఉష తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం రైతులు ఆర్థికంగా ఎదగడానికి ఎందో దోహదపడుతుందని రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి ఉష తెలిపారు. ప్రధానమంత్రి ధన్–ధాన్య కృషి యోజన పథకం, పప్పు ధాన్యాల మిషన్‌ను ప్రధాని నరేంద్రమోదీ శనివారం వర్చువల్ ద్వారా ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ప్రారంభ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి, వివిధ మండలాల నుంచి దాదాపుగా 200 మంది రైతులు, కేవీకే సెంటర్, క్రిడా తరఫున శాస్త్రవేత్తలు, డివిజన్ ఏడీఏలు, మండల వ్యవసాయాధికారులు, విస్తరణ అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ.. ఈ పథకం ఆరేళ్ల పాటు కొనసాగుతుందని తెలిపారు. వ్యవసాయ రంగం తక్కువ ఉత్పాదకత, తగినంత హామీ లేని నీటి పారుదల, పరిమిత రుణ లభ్యత, పంట కోత తర్వాత మౌలిక సదుపాయలు లేకపోవడం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. వ్యవసాయ సామర్థ్యం సమృద్ధిగా ఉన్నప్పటికీ ఉత్పాదకత, ఆర్థికాభివృద్ధి పరంగా వెనుకబడిన అనేక జిల్లాల్లో ఈ సవాళ్ల స్పష్టంగా కనిపిస్తున్నాయని, ఈ అంతరాలను పరిష్కరించాల్సిన అవసరాన్ని గుర్తించి కేంద్రం 2025 బడ్జెట్‌లో పీఎం ధన్‌ధాన్య కృషి యోజన కింద 100 అకాంక్షాత్మక వ్యవసాయ జిల్లాలను అభివృద్ధి చేస్తామని ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త విజయ్‌కుమార్, చిత్తాపూర్ గ్రామ రైతు అన్నపూర్ణ ప్రకృతి వ్యవసాయంలో తన అనుభాలను తోటి రైతులతో పంచుకున్నారు.

క్లుప్తంగా

వాలీబాల్ టోర్నమెంట్ కోసం ఎంపిక

కొడంగల్ రూరల్: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ కోసం ఎంపిక నిర్వహించనున్నారు. 13వ తేదీన అండర్14, 17 విభాగంలో బాలబాలికలకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సెలక్షన్ నిర్వహిస్తారని జిల్లా కార్యదర్శి అనంతయ్య, జోనల్ కార్యదర్శి అజీజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆధార్ కార్డు, ఎలిజిబిలిటీ ఫామ్, బొనఫైడ్ పత్రాలను వెంట తీసుకొనిరావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 97015 86893, 89787 58124 ఫోన్ నంబర్లపై సంప్రదించాలని తెలిపారు.

సీసీ కెమెరాలు తప్పనిసరి

కుల్కచర్ల ఎస్ఐ రమేశ్



దుకాణ యజమానికి నోటీసు ఇస్తున్న పోలీసు సిబ్బంది

కుల్కచర్ల: దుకాణదారులు సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేసుకోవాలని కుల్కచర్ల ఎస్ఐ రమేశ్ తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలో సీసీ కెమెరాలు లేని దుకాణ యజమానులకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేశ్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుతాయన్నారు. నేరాల కట్టడికి బీఎన్ఎస్ 144 ప్రకారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోని దుకాణదారులకు నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. ప్రతీ ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని సహకరించాలని కోరారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాలలోని ప్రతీ దుకాణదారుడికి నోటీసులు అందజేశారు.

విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి



ఎద్దు కళేబరం వద్ద విలపిస్తున్న రైతు

పూడూరు: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని కెరవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని కెరవెల్లి గ్రామానికి చెందిన బాధితరైతు ఫయాజ్‌కు చెందిన ఎద్దు పొలంలో మేత మేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో ఎద్దు అక్కడిక్కడే మృత్యువాత పడిందని రైతు తెలిపాడు. రైతు పొలం నుంచి ఎల్టీలైన్ తీగలు వ్రేలాడుతుండడంతో ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

స్థల వివాదంలో దాడి

మొయినాబాద్ రూరల్: స్థలం విషయంలో జరిగిన దాడిలో ఒకరు తీవ్రంగా గాయపడి, ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ సంఘటన ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సురంగల్ గ్రామ సమీపంలోని పౌల్ట్రీ ఫామ్ దగ్గర 250 గజాల ప్లాట్ ఉంది. దీనిపై రామగళ్ల ఎల్లయ్య కుమారులు నందం, శ్యామ్, శ్రీకాంత్ ముగ్గురికి సమాన హక్కు ఉంది. ఇదే విషయమై శనివారం శ్యామ్ అన్న కుమారుడు ప్రసాద్.. ప్లాట్ వద్ద గొడవకు దిగాడు. బాబాయి అయిన శ్యామ్(35)పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. విషయం బాధితుడి భార్య అనితకు తెలియడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం అక్కడికి చేరుకున్న వా రు.. కత్తిపోట్లతో రక్తపు మడుగులో పడున్న శ్యాంను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బెల్టు దుకాణాలపై దాడి

శంకర్‌పల్లి: రెండు బెల్టు దుకాణాలపై మోకిల పోలీసులు దాడులు చేశారు. ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కొండకల్ గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న న ర్సింహ్మారెడ్డి.. అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. 23 మద్యం సీ సాలను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మోకిలలో రాజు దాబాలో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడి చేయగా.. 5 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. వీరిద్దరిపై కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆగని మట్టి దందా!



నజీరాబాద్‌తండా శివారులో మట్టిని తోడుతున్న జేసీబీ



రంగాపూర్ సమీపంలో ట్రాక్టర్‌లో నింపుతున్న జేసీబీ

- ఇష్టానుసారంగా తవ్వకాలు
- రాత్రి సమయంలో గుట్టలను తోడేస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు

పరిగి: సహజ సంపద తరిగిపోతుంది. అనుమతుల్లేకుండా కొండలు, గుట్టలను అక్రమార్కులు రాత్రికి రాత్రే తవ్వేస్తున్నారు. మట్టి గుట్టలను తోడి టిప్పర్లు, ట్రాక్టర్లలో జేసీబీల సాయంతో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు అనుమతుల పేరిట ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. మరికొందరు, అనుమతులు లేకుండానే రాత్రికి రాత్రి వాహనాల్లో నింపుకొని జోరుగా వ్యాపారం చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా పోలీస్ అధికారులు, మైనింగ్ అధికారులు ఎవరు కూడా కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. రోడ్లపై మట్టి నింపుకున్న వాహనాలు ఇష్టానుసారంగా తిరుగుతున్నప్పటికీ పట్టించుకోకపోవడంతో పలువురు పలు విధాలుగా విమర్శలు చేస్తున్నారు. అసైన్డ్ భూముల్లో, పట్టా భూముల రైతులకు ఎంతో కొంత ముట్టజెప్పి దర్జాగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. కొన్ని చోట్ల నామమాత్రంగా మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు తీసుకుని వేల ట్రిప్పులు తోలుకుంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని పలువురు చర్చించుకుంటున్నారు. అంతేకాకా ఓవర్‌లోడ్‌తో వాహనాలు బీటీ రోడ్లపై తిరగడంతో అవి దెబ్బతింటున్నాయి.

అనుమతులు గోరంత..తోడేది కొండంత..

పరిగి మండలంలోని ఆయా గ్రామాల్లో మట్టి వ్యాపారం మూడుపువ్వులు..ఆరుకాయలుగా సాగుతుంది. మైనింగ్ అధికారుల నుంచి అరకొర అనుమతులు తీసుకుని గ్రామ శివారులోని గుట్టలను యథేచ్ఛగా తవ్వుకుంటున్నారు. అనుమతుల వెనుక భారీ మట్టి మాఫీయానే కొనసాగుతుందని భావిస్తున్నారు. కొన్ని రోజులు, కొంత స్థలాన్ని తవ్వుకోవచ్చని అనుమతులు తీసుకుని ఇష్టానుసారంగా తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే చాలు రాత్రికి రాత్రే పాగ వేస్తున్నారు. రెవెన్యూ అధికారులు రాత్రి వేళల్లో మట్టి దందాపై చర్యలు తీసుకోవాలని మౌఖికంగా ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. పరిగి మండల పరిధిలోని నజీరాబాద్‌తండా, రంగాపూర్, జాఫర్‌పల్లి, రూప్‌ఖాన్‌పేట్, ఇబ్రహీంపూర్, తుంకుల్‌గడ్డ, జాఫర్‌పల్లి, సయ్యాద్‌మల్కాపూర్, ఖుదావన్‌పూర్, రాఘవపూర్, రాపోల్, తొండుపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ భూములు, పట్టా భూముల్లో ఈ దందా జరుగుతుంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి

మైనింగ్ శాఖ అధికారులు, పోలీస్ యంత్రాంగం కన్నెత్తి చూడటం లేదు. రాత్రి వేళల్లో పట్టణ కేంద్రంలో టిప్పర్ల సాయంతో మట్టిని తరలిస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇష్టానుసారంగా మట్టిని తవ్వి రియల్‌ఎస్టేట్ వెంచర్లకు, ఫాంహౌస్‌లకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ట్రిప్పర్ మట్టిని విక్రయిస్తూ రూ. లక్షలు గడిస్తున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. సంబంధిత అధికారుల కళ్లముందే జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

టిప్పర్లు, జేసీబీలను కొనుగోలు చేసి..

ఈ వ్యాపారాన్ని అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులే నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. అధికార పార్టీ నాయకుల టిప్పర్లయితే ఎవరు పట్టుకోరని ఇష్టానుసారంగా దందాను కొనసాగిస్తున్నారు. దీంతో టిప్పర్లు, జేసీబీలను కొనుగోలు చేసి వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అధికారులు, పోలీసులు ఎవరైనా వాహనాలను ఆపితే వారిపై చివాట్లు పెట్టి ప్రజా ప్రతినిధులతో మాట్లాడించి జారుకుంటున్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులకు అనుమతులు ఇవ్వొద్దని, మట్టి దందా చేస్తే కేసులు నమోదు చేయాలని పోలీసులకు, రెవెన్యూ అధికారులకు అధికార పార్టీ నాయకులు హెచ్చరిస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

హర్యానా డీజీపీని అరెస్ట్ చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దళిత ప్రజాసంఘాల నేతలు

పరిగి: హర్యానా ఐపీఎస్ అధికారి వై పూరన్‌కుమార్ ఆత్మహత్యకు కారణమైన ఆ రాష్ట్ర డీజీపీ శత్రుజిత్‌సింగ్‌ను వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం వెంకటయ్య డిమాండ్ చేశారు. శనివారం పరిగి పట్టణ కేంద్రంలో దళిత ప్రజా సంఘాల నేతలతో కలిసి అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పలువురు సీనియర్ అధికారులు కుల వివక్ష, మానసిక వేధింపులు భరించలేక మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత ఐపీఎస్ అధికారి వై.పూరన్‌కుమార్ కూడా వేధింపులు భరించలేకే చండీగఢ్‌లోని ఇంట్లో సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఎనిమిది పేజీలతో కూడిన సూసైడ్ నోట్‌లో ఎవరెవరు వేధించారో రాశారని పేర్కొన్నారు. అందులో రిటైర్డ్ అధికారుల పేర్లు కూడా ఉన్నాయని, వారందరిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తెలుగు రాష్ట్రాలతో పాటు హర్యానా రాష్ట్రంలో సైతం ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య



నర్సమ్మ మృతదేహం

మర్పల్లి: చేతబడి చేసిందని వేధించడంతో ఓ మహిళ బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన మర్పల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మందమీది లక్ష్మి (26) వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె చనిపోకముందు పక్షం రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో లక్ష్మి ఇంటి ముందు దొబ్బల నర్సమ్మ అటు ఇటు తిరుగుతూ కనిపించింది. ఇది గమనించిన లక్ష్మి భర్త నర్సింలు, కుటుంబ సభ్యులు ఇంత రాత్రి ఎందుకు వచ్చావని ప్రశ్నించారు. దీంతో ఇల్లు శుభ్రం చేసుకొనేందుకు పశువుల పేడ కోసం వచ్చినట్లు బదులిచ్చింది. అప్పటికే అస్వస్థతకు గురైన లక్ష్మి ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించడంతో మృతి చెందింది. తన భార్య మృతికి నర్సమ్మే కారణమని, చేతబడి చేయడంతోనే చనిపోయిందని నర్సింలు, కుటుంబసభ్యులు ఆరోపించారు. అంతటితో ఆగకుండా ఆమెను వేధింపులకు గురిచేశారు. దీంతో మనస్తాపానికి గురైన నర్సమ్మ గ్రామంలోని చెన్నారెడ్డి వ్యవసాయ క్షేత్రంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మి కుటుంబసభ్యులు వేధించడంతో నర్సమ్మ చనిపోయిందని కుటుంబ సభ్యులు కంటతడి పెట్టారు. మృతురాలి కుమారుడు దుబ్బల శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వికారాబాద్ డీఎస్పీ, మోమిన్‌పేట సీఐ వివరాలు ఆరా తీశారు.

ఇసుక మాఫియా బరితెగింపు



పట్టుబడిన ట్రాక్టర్

- ఎక్మాయి వాగు నుంచి అక్రమంగా రవాణా
- అడ్డుకోబోయిన పోలీసులపైకి ట్రాక్టర్ ఎక్కించే యత్నం
- ఛేజింగ్ చేసి పట్టుకున్న వైనం
- ఇరువురిపై కేసు నమోదు.. వాహనం సీజ్

బషీరాబాద్: ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. వీరిని పెంచిపోషించారనే ఆరోపణలున్న పోలీసులపైకే ఎదురు తిరుగుతున్నారు. తాజాగా బషీరాబాద్ మండలం నంద్యానాయక్‌తండాలో శుక్రవారం రాత్రి ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకోబోయిన ఇద్దరు కానిస్టేబుళ్లపైకి వాహనం ఎక్కించేందుకు ప్రయత్నించారు. చాకచక్యంగా తప్పించుకోవడంతో పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎక్మాయి శివారులోని వాగు నుంచి జమ్లానాయక్‌తండాకు చెందిన చౌహాన్ బాలకృష్ణ అనే డ్రైవర్ ఇసుక లోడ్‌తో నంద్యానాయక్‌తండా వైపు వెళ్తున్నాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న కానిస్టేబుళ్లు అశోక్, రమేశ్ వాహనాన్ని ఆపమని సూచించారు. వీరు సివిల్ డ్రెస్‌లో ఉండటంతో డ్రైవర్ వారిపైకి ట్రాక్టర్‌ను తోలాడు. త్రుటిలో తప్పించుకున్న పోలీసులు వాహనాన్ని వెంబడించారు. ఇది గమనించి డ్రైవర్ నంద్యానాయక్‌తండాలోని ఓ ఇంటి వద్ద ట్రాక్టర్ ఆపేసి, పరారయ్యాడు. వెంటనే అక్కడికి చేరుకున్న యజమాని శ్రీను వాహనాన్ని వదిలేయాలని కోరినా వినకుండా పీఎస్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న తాండూరు రూరల్ సీఐ నగేష్ శనివారం స్టేషన్‌కు చేరుకుని విచారణ జరిపారు. విధులకు ఆటంకం కలిగించడంతో పాటు పోలీసులపైకి ట్రాక్టర్‌ను తోలేందుకు ప్రయత్నించడాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఈమేరకు ట్రాక్టర్ డ్రైవర్ బాలకృష్ణతో పాటు యజమాని చౌహాన్ శ్రీనుపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ నుమాన్‌అలీ తెలిపారు.

జీఎస్టీ కట్టకుండా ఐరన్ రవాణా

డీసీఎంను స్వాధీనం చేసుకున్న పోలీసులు

పరిగి: అక్రమంగా ఐరన్ తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని శనివారం పరిగి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..పట్టణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఐరన్‌లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వాహనం కంటపడింది. వెంటనే అక్కడికి చేరుకొని వాహనాన్ని ఆపి ఐరన్ లోడ్‌కు సబంధించిన పత్రాలను అడిగారు. సంబంధిత డ్రైవర్ ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో డీసీఎంను సీజ్ చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడితే సహించేది లేదని పోలీసులు హెచ్చరించారు. ఈ విషయంపై స్థానిక ఎస్ఐ మోహన్ క్రిష్ణను వివరణ కోరగా ఎలాంటి సమాధానం ఇవ్వలేదు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన వాహనం

యాలాల: కాగ్నా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కాగ్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారనే సమాచారంతో పోలీసులు రాత్రివేళ తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కాగ్నా నదిలో ఉన్న ట్రాక్టరును పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. వాహనానికి నంబరు లేకపోవడంతో పాటు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. పట్టుబడిన ట్రాక్టరు అగ్గనూరు గ్రామానికి చెందినదిగా గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తిరుపతిలో శంషాబాద్ భక్తుల ఇబ్బందులు

- ఓ కుటుంబం లగేజీ మాయం
- స్పందించిన రాజేంద్రనగర్ ఆర్‌డీఓ
- శంషాబాద్‌కు పయనమైన కుటుంబం



శంషాబాద్: తిరుమలలో శంషాబాద్‌కు చెందిన ఓ కుటుంబం లగేజీ మాయం కావడంతో నాలుగు రోజులు అక్కడ ఇబ్బంది పడింది. చివరకు అధికారుల సహకారంతో నగరానికి బయలుదేరారు. వివరాలు.. తిరుమలలో ఐదుగురు సభ్యులుగా కుటుంబం స్వామివారి దర్శనం చేసుకుంది. ఆ తరువాత వారి లగేజీ మొత్తం దొంగలు కొట్టేశారో.. లేక పోగొట్టుకున్నారో తెలియదు కానీ అయోమయంతో కొండ కిందికి చేరుకుని రైల్వేస్టేషన్‌కు వచ్చారు. నాలుగురోజులుగా వారిని గమనిస్తున్న రైల్వేపోలీసులు ఏం జరిగిందని ప్రశ్నించినా సరైన సమాధానం రావడం లేదు. వృద్ధురాలికి, ఆమె కుమారుడికి మాటలు రావడం లేదు. ఓ మహిళ మాట్లాడినా అర్థం కావడం లేదు. పిల్లలు ఎంత అడిగా సరిగా మాట్లాడడం లేదు. అధికారులు కాగితం పెన్ను ఇవ్వడంతో శంషాబాద్ హి హీరోహోండా షాపు, పైన లగేజీలు పోయాయని రాసింది. దీంతో మూడు రోజులుగా రైల్వేపోలీసులే వారి భోజనం సమకూరుస్తున్నారు. ఆ కుటుంబాన్ని పంపేందుకు రైల్వేపోసులు సాక్షిని సంప్రదించి శంషాబాద్ డీసీపీ, రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు.. ఆర్‌డీఓ స్పందించి వారి రాకకోసం ఏర్పాట్లు చేయడంతో శనివారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరే బస్సులో వారిని రైల్వే పోలీసులు పంపారు.

బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర స్థాయికి..



ఎంపికైన విద్యార్థులతో పీడీలు, తదితరులు



ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓ అక్బర్, జోనల్ సెక్రెటరీ, ఫిజికల్ డైరెక్టర్లు

- ఎస్‌జీఎఫ్ క్రీడల్లో సత్తాచాటిన తాండూరు విద్యార్థులు
- స్టేట్ లెవల్ పోటీలకు ఎనిమిది మంది ఎంపిక

తాండూరు టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తాండూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్- 14, 17 విభాగాల్లో ఎనిమిది మంది బాలబాలికలు జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, త్వరలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం పరిగిలో నిర్వహించిన అండర్- 14 విభాగం డబుల్స్‌లో సాయి ప్రతీక్, అర్జున్‌గౌడ్ ప్రథమ స్థానం, సింగిల్స్‌లో సాయి ప్రతీక్ ప్రథమ స్థానం, అర్జున్ గౌడ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలికల అండర్- 14 విభాగం డబుల్స్‌లో సందర్శిని, దీక్ష ద్వితీయ స్థానం, బాలికల అండర్- 17 విభాగం డబుల్స్‌లో నందిని, మేరీజోన్స్ ద్వితీయ స్థానం, బాలుర విభాగంలో మణికంఠ, చరణ్ ద్వితీయ స్థానం సాధించారు. ఈ ఎనిమిది మంది వికారాబాద్ జిల్లా తరపున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కాగా సెయింట్ మార్క్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ప్రాక్టీస్ చేసి రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ ఆరోగ్యరెడ్డి, పీడీలు రాము, చరణ్ అభినందించారు.

జిల్లా పోటీలకు 108 మంది ఎంపిక

శంకర్‌పల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం జోనల్ స్థాయి అండర్- 14, 17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్ ఎంపికలు నిర్వహించినట్లు ఎంఈఓ అక్బర్, జోనల్ సెక్రెటరీ ప్రభాకర్ తెలిపారు. మండలం పరిధిలోని మియాఖాన్‌గడ్డలో నిర్వహించిన సెలెక్షన్స్‌లో జోన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో కబడ్డీ అండర్- 14 బాలబాలికల విభాగంలో 15 మంది చొప్పున 30 మందిని, అండర్- 17 విభాగంలో 15 మంది చొప్పున 30 మందిని, వాలీబాల్ అండర్- 14 బాలబాలికల విభాగంలో 12 మంది చొప్పున 24 మందిని, అండర్- 17లో 24 మందిని ఎంపిక చేశామన్నారు. వీరు ఈనెల 14న హైదరాబాద్ సరూర్‌నగర్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు బస్వరాజ్, శంకర్, అరుంధతి, పల్లవి, నాగ సంధ్య, అనురాధ, మల్లేశ్, రవీందర్, శ్రీనివాస్, ఆనంద్, అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

బీజేపీ జిల్లా కార్యదర్శి జుంటుపల్లి వెంకటేశ్

తాండూరు టౌన్: 42శాతం బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీజేపీ జిల్లా కార్యదర్శి జుంటుపల్లి వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, బీజేపీపై బురద చల్లడం మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు రాజ్యాంగం అంటేనే గౌరవం లేదని విమర్శించారు. రిజర్వేషన్ సాధన కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 9 ప్రకారం తమిళనాడు ప్రభుత్వం అనుసరించిన తీరును, తెలంగాణ రాష్ట్రంలో కూడా పాటించాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఇరు పార్టీలు బురద చల్లడం మానేయాలని సూచించారు.

ఈవీఎంల గోడౌన్ పరిశీలన



గోడౌన్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఈవీఎంల గోడౌన్‌ను శనివారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎంల గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తును పరిశీలించారు. రాజేంద్రనగర్ తహసీల్దార్, వేర్ హౌస్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డబ్బు కోసం వేధింపులు

మాజీ కార్పొరేటర్ అరెస్టు

- ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షలు డిమాండ్
- శ్రీనాథ్‌రెడ్డికి టీపీఓ వత్తాసు
- ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితుడు
- మాజీ డిప్యూటీ మేయర్ వద్ద రూ. 4 లక్షలు చెల్లింపు
- అయినా ఆగని వేధింపులతో పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి

మణికొండ: తాను కొనుగోలు చేసిన స్థలంలో ఇంటిని నిర్మింకుంటున్న ఓ వ్యక్తిని మాజీ కార్పొరేటర్ ఏకంగా రూ. 10 లక్షలు డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని బతిమాలినా వినిపించుకోకుండా డబ్బులు ఇవ్వకపోతే లోపల వేసి కొడతానని బెదిరించాడు. మాజీ కార్పొరేటర్ అడిగింది ఇచ్చి సమస్య తీర్చుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారి(టీపీఓ) పలు మార్లు నిర్మాణ సామగ్రిని తీసుకెళ్లి మరో వైపు వేధించాడు. వాటిని తాళలేక స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను బాధితుడు ఆశ్రయించాడు. ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ మేయర్‌కు సిఫారసు చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. మాజీ డిప్యూటీ మేయర్ ఇంట్లో పంచాయతీ పెట్టి చివరకు రూ. 4 లక్షలు చెల్లించాడు. అయినా వేధింపులు ఆగక పోవటంతో బాధితుడు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డితో పాటు అతని అనుచరుడు సందీప్‌రెడ్డిలను అరెస్టు చేశారు. బాధితుడు నానాజీ శనివారం మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం... ఓ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తూ హైదర్‌షాకోట్‌లో 100 గజాల పాత ఇంటిని ఇటీవల కొనుగోలు చేశానన్నారు. పాత ఇంటిని తొలగించి కొత్త ఇంటి నిర్మాణం చేపడుతుండటంతో మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడన్నారు. తను కొనుగోలు చేసిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపడితే డబ్బు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించాసన్నాడు. దాంతో మాజీ కార్పొరేటర్ టీపీఓ రాకేష్‌కు చెప్పి పనులను పలుమార్లు నిలుపుదల చేయటం, నిర్మాణ సామగ్రి తీసుకెళ్లి వేధించారన్నారు.

ఎమ్మెల్యేకు ఫిర్యాదు

తన స్థలంలో తను ఇంటి నిర్మాణం చేస్తుంటే మాజీ కార్పొరేటర్ వేధిస్తున్నాడని బాధితుడు నానాజీ ఇటీవల ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. దాంతో ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డికి ఫోన్ చేసి అతన్ని వేధించవద్దని మాజీ కార్పొరేటర్‌కు చెప్పాలని సూచించాడు. అయినా మాజీ కార్పొరేటర్ పట్టు వీడకుండా టీపీఓతో కలిసి వేధించటంతో మాజీ డిప్యూటీ మేయర్ ఇంట్లో ఇటీవల సమావేశం అయి మాజీ కార్పొరేటర్‌కు చివరకు రూ. 3 లక్షలు నగదుగా, రూ. లక్ష ఆన్‌లైన్‌లో చెల్లించాడు. సమస్య తీరిందని అనుకున్నా తనను వదలకుండా మరో మారు డబ్బులు ఇవ్వాలని వేధించటంతో శుక్రవారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశానన్నాడు. ఫిర్యాదులో మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి, అతని అనుచరుడు సందీప్‌రెడ్డి, టీపీఓ రాకేష్‌లు వేధించినట్టు పేర్కొన్నానని బాధితుడు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం మాజీ కార్పొరేటర్, అతని అనుచరున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సమాచారం. టీపీఓ పాత్రపైన విచారణ చేస్తున్నట్టు తెలిసింది. ఈ కేసు విషయమై నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని వివరణ కోరేందుకు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

వివాహిత అదృశ్యం

మణికొండ: నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన వెలుగుచూసింది. పోలీసుల సమాచారం మేరకు... జీవనోపాధి కోసం మహబూబ్‌నగర్ జిల్లా నుంచి కోకాపేటకు చెందిన విజయలక్ష్మి(25) తన శర్త ఆంజనేయులుతో కలిసి సబితానగర్‌కు వచ్చి నివసిస్తుంది. ఈ నెల 7వ తేదీన భర్త ఉదయం పనికి వెళ్లే సమయంలో ఇంట్లోనే ఉంది. సాయంత్రం తిరిగి వచ్చి చూసే సరికి ఆమె కనిపించలేదు. అదే విషయాన్ని ఆంజనేయులు తన అత్త అనసూయకు తెలిపాడు. పలు ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేక పోవటంతో అనసూయ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.